క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి



జడ్చర్ల టౌన్‌: ముందస్తు ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని ఎంఈఓ మంజులాదేవి సూచించారు. మండలంలోని దేవుని గుట్టతండా కేజీబీవీలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు.

నర్సరీలు, పండ్లతోటల పెంపకంపై అవగాహన

అడ్డాకుల: ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్న కూలీలకు గురువారం మూసాపేట రైతువేదికలో సేంద్రియ ఎరువుల తయారీ, పండ్ల తోటలు, నర్సరీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన కూలీలకు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు ఏపీడీ మంజుల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, నర్సరీ ప్లాంటేషన్‌ సూపర్‌వైజర్‌ వెంకట్‌రెడ్డి, ఏపీఓ పులేందర్‌, టెక్నికల్‌ అసిస్టెంట్లు ఈశ్వరయ్య, సుజిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై..

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగవైకల్యం, ఇతర సమస్యలతో బాధపడే విద్యార్థులకు ఫిజియోథెరపీ చేసే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బలరాం పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కోయిల్‌కొండ: ప్రస్తుత సీజన్‌లో పశువులకు వ్యాధులు ప్రబలకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి డా. జీషన్‌అలీ, డా.నరేష్‌ అన్నారు. గురువారం మండలంలోని ఆచార్యాపూర్‌లో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పలు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఎల్‌డీఏ సూపర్‌వైజర్‌ వాసుదేవ్‌, గోశాల నిర్వాహకులు దిలీఫ్‌కుమార్‌ శర్మ పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



నవాబుపేట: మండలంలోని గురుకుంటకు చెందిన టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజేఆర్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అంబేడ్కర్‌ చౌరస్తాలో కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో ఎంజేఆర్‌ యూత్‌ ఆర్గనైజేషన్‌ నాయకులు రవి, శ్రీనివాస్‌, రాజేందర్‌, బంగ్లా రవి, శ్రీనివాస్‌, పురుషోత్తం, వెంకటేష్‌, రాజేందర్‌, గౌతంరెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

కోయిల్‌కొండ/గండేడ్‌/నవాబుపేట: సర్వేయర్లు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలని హౌసింగ్‌ పీడీ వై.భాస్కర్‌ అన్నారు. గురువారం కోయిల్‌కొండ మండల పరిషత్‌ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం రాంపూర్‌, అంకిళ్ల, పారుపల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ కాళప్ప, హౌసింగ్‌శాఖ అధికారులు పుష్పలత తదితరులు ఉన్నారు.

■ గండేడ్‌ మండలంలో వెన్నాచేడ్‌లో సర్వే కొనసాగింది. సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శి కృష్ణానాయక్‌తో మాజీ సర్పంచ్‌ పుల్లారెడ్డి తెలుసుకున్నారు.

■ నవాబుపేట మండలంలో ఇప్పటి వరకు 3,927 ఇళ్ల సర్వే పూర్తిచేసినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్‌ తెలిపారు. నవాబుపేట, కారుకొండ, కాకర్లపహాడ్‌, రుద్రారం, యన్మన్‌గండ్ల గ్రామాల్లో సర్వే ప్రక్రియను పరిశీలించారు.

పరామర్శ

అడ్డాకుల: మూసాపేటకు చెందిన జర్నలిస్టు పేరూరు రమేష్‌ తల్లి శంకరమ్మ బుధవారం సాయంత్రం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకరమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్‌, ఇంద్రయ్యసాగర్‌, భాస్కర్‌గౌడ్‌ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మా, కొండయ్య, చంద్రశేఖర్‌, రవీందర్‌గౌడ్‌, శరత్‌గౌడ్‌, వెంకటేష్‌, కృష్ణ, పేపర్‌ అర్షద్‌ ఉన్నారు.

వాగులో ఇసుక తీసి ఆగం చేయొద్దు

- అదనపు కలెక్టర్‌కు విన్నవించిన కురుమూర్తి గ్రామ రైతులు



కురుమూర్తి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ మోహన్‌రావు

చిన్నచింతకుంట: ఊకచెట్టు వాగులో ఇసుక తీసి తమ బతుకులను ఆగం చేయొద్దని చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామ రైతులు అదనపు కలెక్టర్‌ మోహన్‌రావుకు విన్నవించారు. గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగులో ఇసుక రీచ్‌ ఏర్పాటుపై గురువారం రైతులతో మాట్లాడేందుకు అదనపు కలెక్టర్‌ వచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఊకచెట్టు వాగు నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు అడగంటిపోయి సాగు, తాగునీరుకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వాగు ఆధారంగా ప్రతి సంవత్సరం రెండు పంటలు పుష్కలంగా పండించుకొని జీవిస్తున్నామని తెలిపారు. ఇసుకను తీస్తే తమ భూములు ఎడారిగా మారిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అదనపు కలెక్టర్‌ స్పందిస్తూ.. ప్రభుత్వ అభివృద్ధి పనులు, వివిధ అవసరాల నిమిత్తం రైతుల ప్రమేయంతోనే ఇసుక తీస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌ వద్ద ఒక మీటర్‌ లోతు మాత్రమే తీసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట ఆర్డీఓ నవీన్‌కుమార్‌, తహసీల్దార్‌ ఎల్లయ్య, మైనింగ్‌ ఇరిగేషన్‌ ఏడీ సంజయ్‌, ఎస్‌ఐ ఆర్‌.శేఖర్‌, రైతులు కథలప్ప, సురేష్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, రాము ఉన్నారు.

భూసేకరణకు నివేదికలు ఇవ్వండి



దేవరకద్ర: దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో రైల్వే లైన్‌ డబ్లింగ్‌ పనులు చేపట్టడానికి అవసరమైన భూసేకరణకు నివేదికలు సమర్పించాలని ఆర్డీఓ నవీన్‌ అన్నారు. గురువారం దేవరకద్ర తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. రైల్వేలైన్‌ డబ్లింగ్‌ పనులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ముందస్తుగా నివేదికలు ఇవ్వాలని సూచించారు. రైల్వేలైన్‌ పరిధిలో వచ్చే గ్రామాల్లో సర్వేను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌ కృష్ణయ్య, డీటీ దీపిక తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన 13 మంది ఉద్యోగులు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఇటీవల గ్రూప్‌–4లో జూనియర్‌ అసిస్టెంట్లుగా ఉద్యోగం పొందిన వారిలో 32 మందిని మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీకి కేటాయించారు. అలాగే ముగ్గురు జూనియర్‌ అకౌంటెంట్లను ఇదే మున్సిపాలిటీకి ఉన్నతాధికారులు కేటాయించారు. అయితే ఇప్పటివరకు 12 మంది జూనియర్‌ అసిస్టెంట్లు విధుల్లో చేరగా వార్డు ఆఫీసర్లుగా నియమించారు. మరో జూనియర్‌ అకౌంటెంట్‌ సైతం చేరారు. నిబంధన ప్రకారం మిగతా వారు 60 రోజులలోగా చేరేందుకు గడువు ఇచ్చారు. ఇదిలాఉండగా జడ్చర్ల మున్సిపాలిటీకి 14 మంది జూనియర్‌ అసిస్టెంట్లతో పాటు ఇద్దరు జూనియర్‌ అకౌంటెంట్లను కేటాయించారు. ఇక భూత్పూర్‌ మున్సిపాలిటీకి మాత్రం ఒక్క జూనియర్‌ అకౌంటెంట్‌నే ఇవ్వడం గమనార్హం.

పంచాయతీ కార్మికుల ధర్నా

దేవరకద్ర: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ గురువారం మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం 51 జీఓను రద్దుచేసి, కార్మికులను పర్మినెంట్‌ చేయాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, పనిముట్లు అందజేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

30న ప్రజాఫ్రంట్‌ జిల్లా మహాసభలు

పాలమూరు: తెలంగాణ ప్రజాఫ్రంట్‌ జిల్లా ద్వితీయ మహాసభలను ఈనెల 30న పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజాఫ్రంట్‌ రాష్ట్ర కో–కన్వీనర్‌ శంకర ప్రభాకర్‌ తెలిపారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో గురువారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ రాఘవాచారి, డీటీఎఫ్‌ రాష్ట్ర కన్వీనర్‌ వామన్‌కుమార్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజాఫ్రంట్‌ మొదటి నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఈ నెల 30న నిర్వహించే జిల్లాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్‌ కోఆర్డినేటర్‌ బిచ్చారెడ్డి, జిల్లా కన్వీనర్‌ మణ్యంకొండ, శ్రీదేవి, వెంకటయ్య, వెంకట్‌రాములు, ప్రవీణ్‌కుమార్‌, అజీజ్‌ పాల్గొన్నారు.

నెమలికి చికిత్స



హన్వాడ/మహమ్మదాబాద్‌: హన్వాడ మండలం టంకరలో గురువారం ప్రమాదవశాత్తు గాయపడిన జాతీయపక్షి నెమలికి స్థానిక వెటర్నరీ వైద్యశాలలో డా.హరిప్రసాద్‌ చికిత్స అందించారు. టంకరకు చెందిన చంద్రయ్య వ్యవసాయ పొలంలో మేత కోసం వచ్చిన నెమలి కాళ్లకు తీగలు చుట్టుకోవడంతో గాయపడిందని.. రైతులు గమనించి ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌కు సమాచారం ఇవ్వడంతో వెటర్నరీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం అక్కడి నుంచి పిల్లలమర్రి పార్కుకు నెమలిని తరలించారు.

మైసమ్మ ఆలయాభివృద్ధికి ఆటంకాలు తొలగేనా?



అటవీ ప్రాంతంలో ఉన్న మైసమ్మ ఆలయం

నవాబుపేట: కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న పర్వతాపూర్‌ మైసమ్మ దేవత దేవాలయం అభివృద్ధికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్న దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నా.. అటవీశాఖ నిబంధనలు ఆటంకంగా మారాయి. ఈ నేపథ్యంలో మైసమ్మ దేవాలయ సమస్యను గురువారం అసెంబ్లీలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రస్తావించారు. దేవాలయానికి ఐదెకరాల స్థలం కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మైసమ్మ దేవాలయం అటవీశాఖ పరిధిలో ఉందని.. అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి అవసరమన్నారు. దేవాలయానికి ఐదెకరాల భూమి కోసం కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ కొలిక్కి రాలేదం లేదన్నారు. పర్వతాపూర్‌ మైసమ్మ దేవాలయం అభివృద్ధికి ఆటంకంగా మారిన అటవీ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు. దేవాలయానికి ఐదెకరాల భూమికి గాను మరో చోట ఐదెకరాల భూమి కేటాయిస్తామన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అటవీ భూముల సమస్య చాలా ప్రాంతాల్లో ఉందని, పర్వతాపూర్‌ మైసమ్మ దేవాలయ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న వార్డుల పర్యటన



ఖలీల్‌చౌక్‌ ప్రాంతంలో మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ వార్డుల బాట పట్టారు. ఇందులో భాగంగా వైస్‌ చైర్మన్‌ షబ్బీర్‌అహ్మద్‌తో కలిసి గురువారం 33, 45 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ఖలీల్‌చౌక్‌, పాతతోట తదితర ప్రాంతాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని ఆరోపించారు. అనంతరం ఎదిరలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్నారు. అలాగే ఐదో వార్డు పరిధిలోని ద్వారకపురి కాలనీలో హైమాస్ట్‌ లైట్లను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో కౌన్సిలర్‌ మునీరుద్దీన్‌, కాంగ్రెస్‌ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబ, మహబూబ్‌ సమీ, మునసర్‌, అఫ్రోజ్‌ఖాన్‌, హన్మంతు, శివశంకర్‌, అంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనలో ముందుంటాం



జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): ఉద్యోగుల హక్కుల సాధనలో టీజీఓ ముందుంటుందని రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్‌ అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన టీజీఓ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీని మంజూరు చేయాలని, హెల్త్‌ కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో డీఏలను విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్‌ విధానాన్ని అమలుచేయలని డిమాండ్‌ చేశారు. జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌, అసోసియేట్‌ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యాదగిరి, వరప్రసాద్‌, టైటస్‌పాల్‌, శ్రీను గౌడ్‌, రాంపాల్‌, సంధ్య, శివరాజు, బాలుయాదవ్‌, మురళీధర్‌ పాల్గొన్నారు.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'



జిల్లా కేంద్రంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మ కూడలిలో..

సాక్షి నెట్‌వర్క్‌: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్‌ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట, ఎల్లమ్మ కూడలి, అంబేడ్కర్‌ చౌరస్తా, కోయిల్‌కొండ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఆర్‌అండ్‌బీ చౌరస్తాలో ఎస్సీ సెల్‌ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ అమిత్‌షా పార్లమెంట్‌ సభ్యత్వం రద్దు చేయాలని.. ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మహమ్మదాబాద్‌: మండలంలోని దేశాయిపల్లిలో గురువారం గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకు అభిషేకం, మెట్లపూజ అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్‌, రాజుగౌడ్‌, చెన్నయ్య, బాల్‌రాజ్‌, గోపాల్‌ పాల్గొన్నారు.

ఆశావర్కర్లను విస్మరించడం తగదు

గండేడ్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆశావర్కర్లను విస్మరించడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆశావర్కర్ల బస్సుజాతా పోస్టర్లను విడుదల చేశారు.ఈ నెల 22న జిల్లా కేంద్రంలో చేపట్టే బస్సుజాతాలో ఆశావర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నహీదా, జహంగీర్‌, శ్యామలమ్మ, కిష్టమ్మ, భగవంతమ్మ పాల్గొన్నారు.

తిరుపతిలో తెలంగాణ భక్తులపై వివక్ష

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): తిరుపతిలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకులు, వ్యాపారులపై వివక్ష చూపుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. గురువారం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి దేవుడు అంటే ప్రపంచానికే దేవుడని, తెలంగాణ నుంచి వచ్చే భక్తులపై వివక్ష చూపడం సరికాదన్నారు. తెలంగాణ, ఆంధ్ర భక్తులను ఒకే మాదిరిగా చూడాలన్నారు. తెలంగాణలో టీటీడీకి కల్యాణ మండపాల కోసం స్థలాలు ఇవ్వడం గొప్ప అదృష్టంగా భావిస్తామని అన్నారు. తిరుమల కొండపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఇచ్చిన మాదిరిగానే కాటేజ్‌ నిర్మాణానికి తెలంగాణకు ఎకరా స్థలం ఇవ్వాలని గతంలో కోరినట్లు గుర్తుచేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ రాజేశ్వర్‌గౌడ్‌, ముడా మాజీ చైర్మన్‌ వెంకన్న, బీఆర్‌ఎస్‌ ఆంజనేయులు, శివరాజు, నర్సింహారెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న అంజన్న ఉత్సవాలు



దేవాలయం రాజగోపురం ద్వారం వద్ద భక్తుల సందడి

దేవరకద్ర: చిన్నరాజమూర్‌ ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని, నైవేద్యాలు, దాసంగాలను సమర్పించారు.గండజ్యోతులు మోస్తున్నారు. కొత్తవాహనాలకు పూజలు చేయించారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది

జడ్చర్ల టౌన్‌: అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని జడ్చర్ల ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది సూచించారు. మండలంలోని గంగాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం అగ్నిప్రమాదాలపై మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల్లో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పొగను పీల్చుకోకుండా జాగ్రత్త పడాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.నరేష్‌, డా.సంతోష్‌ భవాని, ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది రాఘవేందర్‌, కేశవులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌: సమగ్రశిక్ష అభియాన్‌లో 15ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు డిమాండ్‌ చేశారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు గురువారం సీపీఎం పార్టీ తరఫున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు..తూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న రిసోర్స్‌ పర్సన్లు, ఐఈఆర్‌పీలు, కంప్యూటర్‌ ఆపరేటర్లు, ఎంఐఎస్‌ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, వాచ్‌మెన్లు, వంట మనుషులు, అటెండర్లను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించి, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్‌ చేశారు.

పీఆర్‌సీ అమలుచేయాలి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్‌సీ కమిషన్‌ నుంచి రిపోర్టు తెప్పించుకొని 45 శాతంతో ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలుచేయాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ ఫారుఖ్‌ హుస్సేన్‌ గురువారం ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం ఏకపక్షంగా అత్యంత తక్కువగా కేవలం 5 శాతం మధ్యంతర భృతి ప్రకటించి చేతులు దులుపుకొందని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌సీ అమలుతో పాటు పెండింగ్‌ బిల్లులు, నాలుగు డీఏలు విడుదల చేయాలని కోరారు.

చర్చకు సిద్ధం

భూత్పూర్‌: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో భూత్పూర్‌ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు సిద్ధమని.. ఎక్కడికి రావాలో చెప్పాలని బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏడాది పాలనలో మండలంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

జడ్చర్ల టౌన్‌: మండలంలోని నాగసాల స్వామి నారాయణ గురుకుల అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు గురువారం మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రధాన వీదుల్లో ర్యాలీ నిర్వహిస్తూ.. ధూమపానం, గుట్కా, ఆల్కహాల్‌ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, పాఠశాల డైరెక్టర్‌ భావేష్‌, ప్రిన్సిపాల్‌ రమేష్‌రెడ్డి, రాజశేఖర్‌ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జడ్చర్ల: మున్సిపాలిటీలోని 24వ వార్డులో గురువారం కౌన్సిలర్‌ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మురుగు కాల్వలను శుభ్రపర్చడంతో పాటు జేసీబీతో ముళ్లపొదలు, కంప చెట్లను తొలగించారు. రోడ్లపై గుంతలను పూడ్చారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్‌ సూచించారు.

24న చికెన్‌ వ్యర్థాల సేకరణకు టెండర్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు చికెన్‌ వ్యర్థాల సేకరణకు గాను తాజాగా మున్సిపల్‌ అధికారులు టెండర్‌ పిలవాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్‌ 25న నిర్వహించిన టెండర్లలో ఖాజాగయాసుద్దీన్‌ రూ.15.30 లక్షలకు దక్కించుకున్నారు. అయితే ఆయనకు జిల్లా కేంద్రంలోని సుమారు 200 మంది చికెన్‌ దుకాణదారులలో కొందరు ఈ వ్యర్థాలు ఇచ్చేందుకు నిరాకరిస్తూ వస్తున్నారు. తమకు కొంత కమీషన్‌ ఇవ్వాలని తరచూ గొడవ పడుతున్నారు. దీంతో సదరు కాంట్రాక్టరు ఈ టెండరు రద్దు చేయాలని మున్సిపల్‌ అధికారులకు ఈ నెల 16న విన్నవించగా.. అందుకు అంగీకరించారు. ఇప్పటివరకు మున్సిపాలిటీకి రూ.3.85 లక్షలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకొన్నాడు. చేసేదేమీ లేక తిరిగి వచ్చే మూడు నెలల కాలానికి గాను మున్సిపల్‌ అధికారులు ఈనెల 24న టెండరు నిర్వహించనున్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో రెండురోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్‌ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా.. జరిమానాతో పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఇటీవల వన్‌టౌన్‌ పోలీసులు చేపట్టిన డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీల్లో నవాబ్‌పేట మండలం కాకర్లపాడుకు చెందిన వెంకటేష్‌ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం సెకండ్‌ మేజిస్ట్రేట్‌ నిర్మల ఎదుట హాజరుపరచగా.. రూ.2వేల జరిమానా, రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు వన్‌టౌన్‌ సీఐ అప్పయ్య తెలిపారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో ఉన్న శ్రీప్రతిభ పాఠశాలలో గురువారం 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఐఐటీ ఆన్‌లైన్‌ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీ పరీక్ష అంటే భయం పోగొట్టి, పోటీతత్వంపెంచే విధంగా విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ హారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత రాజకీయాలు బాధాకరం



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: గతంలో ఆర్థిక, సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగేవని.. ఇప్పుడు మతం ఏజెండాగా దేశ రాజకీయాలు కొనసాగడం బాధాకరమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్‌ భవనంలో రాంప్రసాద్‌ బిస్మిల్‌, అష్ఫాఖుల్లాఖాన్‌ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో ప్రగతిశీల భావాలు కలిగిన యువత రావడం లేదన్నారు. లాభాపేక్ష, స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ రాఘవాచారి మాట్లాడుతూ.. భారత సమాజం పూర్వం నుంచి కూడా బహుళ సంస్కృతుల సమ్మేళనమని అన్నారు. పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు అసహజంగా మతోన్మాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎస్‌ఎం.ఖలీల్‌, లక్ష్మణ్‌, హనీఫ్‌ అహ్మద్‌, వామన్‌కుమార్‌, బుచ్చారెడ్డి, ఫారుఖ్‌ హుస్సేన్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ షబ్బీర్‌ పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

చిన్నచింతకుంట: మాలమహానాడు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఆ సంఘం మండల నాయకులు దశరథ్‌, కాంతారావు, కృష్ణయ్య అన్నారు. గురువారం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా చేయాలని మాలలు న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. మాలలను అక్రమంగా అరెస్టులు చేసి, నిర్బంధించడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో పరశురాం, శ్రీహరి, మోహన్‌కుమార్‌, దండు కృష్ణ, ప్రభాకర్‌ ఉన్నారు.